క్లుప్తంగా

చిన్నమందడి గ్రామ సందర్శన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిన్నమందడి గ్రామాన్ని మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు శనివారం సందర్శించారు. తొమ్మిదేళ్లుగా గ్రామంలో జరిగిన అభివృద్ధిని పరిశీలించి, సర్పంచ్ సూర్యచంద్రారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం చిన్నమందడి గ్రామాన్ని సందర్శించామని, గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి వివరాలను మంత్రికి అందజేస్తామని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి తెలిపారు.

అయ్యవారిపల్లివాసికి డాక్టరేట్



పెబ్బేరు: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన తూముకుంట ప్రవీణ్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నట్లు శనివారం ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన రాజశేఖర్, రామతులసమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి మల్టీమోడల్ ఆధారిత సెంటిమెంట్ విశ్లేషణ అనే అంశంపై ప్రొఫెసర్ విష్ణువర్ధన్, ప్రిన్సిపాల్ సహకారంతో పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు పేర్కొన్నారు. అతడు స్వాతంత్ర సమరయోధుడు అయిన యాపర్ల గాండ్ల శంకరయ్య మనవడు కావడంతో ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



కొత్తకోట: ఎన్నో ఏళ్లుగా మున్సిపాలిటీలో చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ హైదరాబాద్‌లో ఈనెల 12న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25లక్షల ఇన్సూరెన్స్ ప్రవేశపెట్టి, కార్మికుడు మరణిస్తే అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.30వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, సత్యారెడ్డి, ఆనంద్‌రాజ్, ఎర్రన్న, కుర్మన్న, డేవిడ్, కొండన్న, బాలస్వామి, సుశీల, శిరీష, సరళ, పద్మ, లక్ష్మి ఉన్నారు.

రంగురాళ్ల గుర్తింపుపై చిన్నారులకు అవగాహన



వీపనగండ్ల: మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పసిపిల్లల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు రంగురాళ్ల తయారీ, వాటి గుర్తింపుపై అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, మహేశ్వరి, ఎల్లమ్మ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పసిపిల్లల్లో పెరుగుదలతో పాటు వారి మానసిక స్థితిని మెరుగుపరిచేందుకు వారికి పుస్తకాల్లో బొమ్మల గుర్తింపుతో పాటు స్వయాన చిన్న చిన్న గులకరాళ్లను తెప్పించి వాటిపై అవగాహన కల్పించడం వల్ల వారిలో జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు.

వార్డుల సందర్శన



వనపర్తి: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో బీఆర్‌ఎస్ నాయకులు పర్యటించి ప్రభుత్వ ఫలాలు అందరికీ చేరుతున్నాయా.. లేదా అనే వివరాలు సేకరించారు. జిల్లా కేంద్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు చీర్ల సత్యం పలువురు నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వనపర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాల పాలైన ఘటన జిల్లా కేంద్రంలోని మర్రికుంట సమీపంలో చేటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడుకుంట్లకు చెందిన భీసన్న మోటార్ సైకిల్‌పై వనపర్తికి వస్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్ వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో భీసన్న ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

అపర భగీరథుడు వైఎస్సార్



వనపర్తిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: రాష్ట్రంలోని నిరుపేదల బతుకులకు భరోసా కల్పించిన మహానేత వైఎస్సార్ సేవలను ఎన్నటికీ మరువలేనివని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం నుంచి రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీగా వచ్చి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీర్ల చందర్ మాట్లాడుతూ.. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎంతో సాహసోపేతంగా ప్రవేశపెట్టి, ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చెరగని ముద్రవేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నారు. కార్యక్రమంలో కమ్మర్ మియా, కోట్ల రవి, నందిమల్ల యాదయ్య, సమద్, కదిరె రాములు, గంధం కృష్ణ బాబు, చీర్ల జనార్దన్, బాబా, వెంకటేష్, బొంబాయి మన్నెంకొండ, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని శనివారం కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కూతురు చేపట్టిన పాదయాత్ర సమయంలో కొత్తకోటలో 2వేల కిలోమీటర్ల మైలు రాయి దాటిన సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బోయేజ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నిర్మించిన ప్రాజెక్టులతో పాటు సప్తసముద్రాలను ఏర్పాటు చేసిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కిందన్నారు. రూ.7వేల కోట్లతో జిల్లాలో నాలుగు భారీ నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చీర్ల నాగన్న సాగర్, సురేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాములుసాగర్, విజయ్‌కుమార్, మోహన్‌గౌడ్, ఖాజామైనోద్దీన్, వాజీద్, గొల్ల బాలరాజు, వెంకటయ్య, నాగన్న, నాగరాజు, కుర్మన్న, బుడ్డన్న తదితరులు ఉన్నారు.



ఖిల్లాఘనపురంలో..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో శనివారం వైఎస్సార్ జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి స్వీట్లు, పండ్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, 108, 104, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఫీజు రియంబర్సుమెంట్, రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ తదితర ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌దే అన్నారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, కృష్ణయ్య, దేవన్న, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్, రవీందర్‌రెడ్డి, నాగేశ్వర్, చెన్నయ్య, మునగాల బాబు, శరవంద, రాజు, గోవింద్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..

పంచాయతీ కార్మికులకు పీఆర్సీ వర్తింపజేయాలి



వనపర్తిలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి: ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి గ్రామాల్లో పనులు చేసే పంచాయతీ కార్మికులకు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రాములు, రాజు, రాంచందర్, సతీష్, హన్మంతునాయక్, సాయన్న, మోహన్, గుసెమ్మ, ప్రమీల, నాగమ్మ, నారమ్మ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని 10, 11 వార్డుల్లో కమ్యూనిస్టు నాయకులు పర్యటించి సొంత ఇళ్లు లేనివారిని గుర్తించారు. ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇంటిస్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పుట్ట అంజనేయులు, బుచ్చమ్మ, లక్ష్మి, శశికల, లక్ష్మి, జానకమ్మ, వసంత, గోవిందమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మండలంలో కొనసాగుతోంది. కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకుడు వంగలి శివరాజ్ మద్దతు ప్రకటించారు. జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, మల్టీ పర్పస్ వర్కర్ యూనియన్ విధానం రద్దు చేయాలని కోరారు. పెంటయ్య, యాదగిరి, స్వామి, కుర్మయ్య, సుగ్రీవుడు, నాగమణి, బాలస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు



కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: సీఎం కేసీఆర్ అవినీతి పాలనతో రాష్ట్రం అప్పులపాలవుతుందని బీజేపీ మండల ఇన్‌చార్జ్ బి.కృష్ణ, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ పెద్దిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా అంజనగిరిలో శక్తికేంద్ర ఇన్‌చార్జ్ అంజి ఆధ్వర్యంలో మోదీ అమలు చేసిన పథకాల కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంటికో బెల్ట్ షాపు, వీధికో వైన్స్, ఊరికో బార్‌తో ప్రజలను మద్యానికి బానిసలు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకంటే బీఆర్‌ఎస్ నాయకులు, కేసీఆర్ సన్నిహితులకే అధికంగా ఉపయోగపడుతుందని ఆరోపించారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక మద్యం ద్వారా రూ.10,700 కోట్ల ఆదాయం వస్తే.. నేడు రూ. 45వేల కోట్ల ఆదాయం వస్తుందని ఇదేనా అభివృద్ధి అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేందర్, వెంకటేష్, భరత్, అంజి, రాము, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పంచాయితీలో రెండు కుటుంబాల ఘర్షణ



వీపనగండ్ల ఆస్పత్రి వద్ద పరిస్థితిని అదుపులోకి తెస్తున్న పోలీసులు

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన రెండు కుటుంబాలు కొద్దిపాటి పొలం పంచాయితీతో శనివారం ఒకరిపై ఒకరు గొడ్డళ్లు, కట్టెలతో దాడులు చేసుకోగా.. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయిన ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మదుగని బాలస్వామి కుమారులైన పెద్దరాముడు, వసంత రాముడు, రామకృష్ణతో పాటు పెద్దరాముడి కుమారులైన రాజశేఖర్, ఎల్లస్వామి కొద్దిపాటి పొలం పంచాయితీ నెపంలో మదుగని నర్సింహ కుమారులు అయిన పెద్దరాముడు, చిన్నరాముడు, రామకృష్ణ, వెంకట్రాములుపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో నర్సింహ కుమారులు రామకృష్ణ, చిన్నరాముడు తీవ్రంగా గాయపడగా మరికొందరు స్వల్పగాయాలకు గురయ్యారు. ప్రతి దాడిలో బాలస్వామి కుమారుడైన రామకృష్ణ కూడా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరందరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తున్న సమయంలో బాలస్వామి కుమారుడు వసంత రాముడు ఆస్పత్రి వద్ద పోలీసుల ఎదుటే చిన్నరాముడిపై రాళ్లతో దాడి చేయగా చేతికి తీవ్ర గాయం అయింది. ఈ సంఘటనలో తీవ్ర తోపులాట జరగగా పోలీసులు లాఠీఛార్జీ జరిపి ఇరువర్గాలను శాంతింపచేశారు. ఘటనపై పూర్తి సమాచారాన్ని సేకరించి, కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



పోస్టర్లతో నిరసన చేస్తున్న నాయకులు

పెబ్బేరు: దళిత మహిళ సైదమ్మపై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని కుల అసమానతల పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో శనివారం నిరసన చేశారు. ఈ సందర్భంగా కుల అసమానతల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈరపాగ గోవిందు మాట్లాడుతూ శ్రీరంగాపూర్ మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన దళిత మహిళ సైదమ్మ సబ్సిడీ కింద ట్రాక్టర్ కొనుగోలు చేశారు. దీంతో గ్రామంలోని ఆనంద్ అనే వ్యక్తికి ఒక సంవత్సరం కిరాయికి ఇవ్వడంతో పాటు గడువు ముగిసిన తర్వాత తమ ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. అనంతరం 12 రోజుల తర్వాత కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేశారని సైదమ్మ ఆనంద్‌పై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినా ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని వారు ఆరోపించారు. నిందితులపై చట్ట పరమైన చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు.

ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయండి

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లితండాలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని తండావాసులు కోరుతున్నారు. ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో తండాలో విద్యుత్ సమస్యలు ఉన్న, ప్రమాదాలు చోటు చేసుకున్నా మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తోంది వారు వాపోతున్నారు. ఈ సమస్యను పరిష్కారించాలని పలు మార్లు విద్యుత్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించి నా ఫలితం లేదని తండా వాసులు అసహనం వ్య క్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కూలీలతో కాల్వల మరమ్మతు



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీల ద్వారా జూరాల, భీమా కాల్వల్లోనూ ఏపుగా పెరిగిన జమ్మును తొలగించడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. మండల కేంద్రంలోని ఊరచెరువు సమీపంలో ఉన్న భీమా కాల్వలో పెరిగిన జమ్మును ఉపాధి కూలీలు పూర్తి స్థాయిలో తొలగించారు. దీంతో సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చివరి ఆయకట్టుకు నీరు అందుతుందని పలువురు రైతులు అంటున్నారు.

‘గురుకులం’లో అడ్మిషన్లు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో చేరేందుకు మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.తిరుపతయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని కోసం ఈనెల 11న తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, బాల్‌నగర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలురు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 94910 64525 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

స్థల వివాదంపై గోవర్ధనగిరిలో ధర్నా



ధర్నా చేస్తున్న దళితసంఘాల నాయకులు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో దళితవాడలో ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించారన్న నెపం మోపుతూ శనివారం గ్రామంలోని దళితులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. 40ఏళ్ల క్రితం గ్రామ పాఠశాల సమీపంలోని స్థలాన్ని దళితవాడగా పిలిచేవారని, ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారని, వారి నుంచి దళితులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కాగా ఈ స్థలాన్ని గ్రామానికి భూజల ప్రవళిక, ముంతా వెంకటస్వామి, రేణుక, లలిత, బాలీశ్వరమ్మ కొనుగోలు చేశారని, భూజల ప్రవళిక ఈ స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్, పంచాయితీ అనుమతితో పాటు కోర్టు ఆర్డర్ తీసుకున్నారని వారు తెలిపారు. కాగా ఈ ఘటనపై వనపర్తి సీఐ డీకే మహేశ్వర్‌రావు, స్థానిక ఎస్‌ఐ రామన్‌గౌడ్ స్పందిస్తూ కోర్టు పరిధిలో ఉన్న ఈ స్థలాన్ని ఇరుపక్షాల వారు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. కాగా 2 రోజులుగా ఈ స్థలంలో దళితులు గుడిసెలు వేసుకోగా.. స్థలాన్ని కొనుగోలు చేశామని చెబుతున వారు గుడిసెలను తొలగిస్తున్నారు. ధర్నాలో రాములు, గోపి, నర్సింహ, పర్వతాలు, జ్యోతి, స్వాతి, రామకృష్ణ, శ్రావణి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అసంతృప్తితోనే కాంగ్రెస్‌లో చేరికలు



మల్లురవి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

అమరచింత: పట్టణానికి చెందిన కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షుడు ఏకే వెంకటేశ్వర్‌రెడ్డి, జాన్, జాలిగి వెంకటేష్ ఏఐసీసీ నాయకుడు మల్లురవి సమక్షంలో శనివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గతంలో ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం అందరూ కలిసి పని చేయాలని రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు సైనికులుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జుబేర్‌అహ్మద్, మహాంకాళీ విష్ణు, కిసాన్ సెల్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, అరవింద్‌రెడ్డి, ప్రభాకర్, మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: కొత్తకోట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా అప్పరాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వంశరాజు మాసన్న నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ రేవంత్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు అందినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అప్పరాలకు ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసిన మాసన్న అందరితోనూ సౌమ్యుడిగా గుర్తింపు పొందారు. టీపీసీసీ కార్యదర్శి, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం జరిగిందని మాసన్న తెలిపారు.

గోబర్ గ్యాస్ ప్లాంట్ పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిన్నమందడిలో గల ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న గోబర్ (బయో) గ్యాస్ నిర్మాణ పనులను జిల్లా పంచాయతీ అధికారి సురేష్ పరిశీలించారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ నిధుల నుంచి మంజూరైన రూ.లక్ష వ్యయంతో నిర్మిస్తున్న గోబర్ గ్యాస్ ప్లాంట్ పనులు పూర్తి కావస్తుంటంతో ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించేందుకు పరిశీలించినట్లు ఎంపీడీఓ అఫ్జల్ తెలిపారు. గోబర్ గ్యాస్ నిర్మాణ పనులు పూర్తయితే మధ్యాహ్న భోజన ఏజెన్సీకి అప్పగిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

యుద్ధపాత్రిపదికన పైప్‌లైన్ మరమ్మతు పనులు



పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

అమరచింత: మండలంలోని కేజీబీవీ పాఠశాలకు మిషన్ భగీరథ తాగునీరు అందడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌డీఓ పద్మావతికి విన్నవించడంతో అధికారుల ఆదేశాల మేరకు తాగునీటి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ శనివారం పాఠశాలను సందర్శించి మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీలను గుర్తించారు. సిబ్బందితో వాటికి మరమ్మతు చేపట్టేందుకు చర్యలు ప్రారంభించారు. ఈమేరకు బోరు ద్వారా వచ్చేనీటిని షాంపిల్ కోసం బాటిల్‌లో సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పైప్ లైన్ లీకేజీలతో పాటు నీటిని సంప్‌కు అందించే పనులను చేపడుతున్నట్లు తెలిపారు. గత వేసవి సెలవుల్లో తాగునీటిని వినియోగించలేని కారణంగా అక్కడక్కడ పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయన్నారు. సంప్‌లో నీరు నిండిన రెండు గంటల లోపే అవి ఇంకిపోతున్నాయని అక్కడి సిబ్బంది తెలిపారని, వీటిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

పరారీలో మరో ఆరుగురు



పోలీసులకు పట్టుబడిన వారు

పెబ్బేరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. ఆ వివరాలు.. రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని మహిళలపై ఉన్న బంగారు నగలు, సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లలో నగదు చోరీ చేయడం లక్ష్యంగా కొందరు ముఠాగా ఏర్పడ్డారు. ఉండవెల్లి గ్రామస్తురాలు మాచెర్ల సురేఖ ఏఎన్‌ఎంగా పనిచేస్తోంది. గతనెల 2వ తేదీన పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా పెబ్బేరులోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు మూడున్నర తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్, పర్సును దొంగలించారు. దీంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా పెంచారు. శుక్రవారం బస్టాండ్‌లో చోరీకి వచ్చినట్లు పక్కా సమాచారం అందడంతో, అక్కడికి పోలీసులు చేరుకున్నారు. అనుమానంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుంటుండగా, ఆరుగురు పారిపోయారు. అదుపులోకి తీసుకున్న గుంజ గిడ్డన్న, గుంజ అగిరామమ్మను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. కర్నూల్ జిల్లా ఆత్మకూర్ మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన ఎనిమిది మంది కలిసి ముఠాగా ఏర్పడి, రద్దీగా ఉన్న ప్రాంతాలు, బస్టాండ్‌లలో దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. మిగితా ఆరుగురిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



అమరచింత: మండలంలోని కేజీబీవీ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకుంటున్నామని మండల స్పెషల్ అధికారి, డీపీఓ సురేష్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో కేజీబీవీని శనివారం సందర్శించారు. ఈమేరకు పాఠశాల పరిసరాలతో పాటు తరగతి, వంట గదిని పరిశీలించారు. అనంతరం వంట మనుషులతో మాట్లాడుతూ ఆహార పదార్థాలను పరిశుభ్రమైన నీటితో కడిగి వండాలన్నారు. కుళ్లిన కురగాయలను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతూ జరిగిన సంఘటన గురించి వివరాలను తెలుసుకున్నారు. బోరు నీరును తాగుతున్నామని విద్యార్థినీలు చెప్పడంతో మిషన్ భగీరథ నీరు వెంటనే పాఠశాలకు సరఫరా అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మళ్లీ పాఠశాలలో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఓ షాబానకు సూచించారు. డీపీఓ వెంట ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల సందర్శన

కేజీబీవీలో జరిగిన సంఘటనపై వివరాలను తెలుసుకునేందుకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శనివారం కేజీబీవీని సందర్శించారు. విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలతో విషయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులు మనోధైర్యంగా ఉండాలని కోరారు. నాణ్యమైన ఆహారం అందించాలని, నీటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, శ్రీను, అగ్రిప్ప, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



చిన్నచింతకుంట: ఉంద్యాలలోని 2వ వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ఇళ్ల సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉంది. దాని చుట్టూ ముళ్ల పొదలు అలుముకొన్నాయి. రోడ్డు పక్కనే ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురై ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరేచోట ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కనీసం కంచె అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.